రేషన్ సరుకుల కోతతో ప్రజాగ్రహం

- ఈ నెల రేషన్‌లో బియ్యం మాత్రమే పంపిణీ
- కందిపప్పు, చక్కెర, రాగి,గోధుమపిండి కోత
- పలుచోట్ల మహిళల అసంతృప్తి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మేలని పెదవి విరుపు



భట్టిప్రోలులో ఎండీయూ వాహనం వద్ద రేషన్ సరుకులు పంపిణీ

భట్టిప్రోలు: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఈ నెల పంపిణీ చేసే రేషన్ సరుకుల్లో బియ్యం మాత్రమే కార్డు దారులకు పంపిణీ చేస్తున్నారు. పంచదార, కందిపప్పు, రాగులు, రాగి పిండికి కోత పెట్టారు. ఏవో సాకులు చెప్పి మిగిలినవి ఇవ్వకుండా కోతలు పెట్టారని రేషన్ లబ్ధిదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం కార్డు దారులకు ఈ నెల బియ్యానికే పరిమితం చేసింది. మార్కెట్‌లో కందిపప్పు, పంచదార రేటు అధికంగా ఉండటంతో ఈ సరుకులు కొనుగోలు చేసి తినే పరిస్థితి లేక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.180 పలుకుతుంది. ఇలాంటి తరుణంలో కందిపప్పు పంపిణీ చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, పంచదార పంపిణీ చేయాలని కోరుతున్నారు. భట్టిప్రోలు మండలంలో 16,419 రేషన్ కార్డులు ఉన్నాయి.ఈ విషయమై సీఎస్‌డీటీ డి.రవీంద్రకుమార్‌ను వివరణ కోరగా గోదాములకు ఒక్క బియ్యం మాత్రమే స్టాక్ వచ్చిందన్నారు. కందిపప్పు, పంచదార స్టాక్ రాలేదని, దీంతో ఆ రెండు సరుకులు పంపిణీ చేయడం లేదన్నారు. వచ్చే నెలలో స్టాక్ వస్తే పంపిణీ చేస్తామన్నారు.

ప్రజాసేవలో అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దు

- వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు
- భట్టిప్రోలులో అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు: ప్రభుత్వ పథకాలు పేదలకు అందించడమే లక్ష్యంగా పని చేద్దామని ప్రజాసేవలో అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అధికారులకు సూచించారు. బుధవారం భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆనందబాబు మాట్లాడుతూ అధికారులంతా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. చిత్త శుద్ధితో పని చేసి వేమూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్‌వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. గత ప్రభుత్వ హయంలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి నివేదిక రూపొందించాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. వారికి అనుమతులు ఎవరు ఇచ్చారని, అనుమతులు ఉన్నాయా లేవా ఆరా తీయాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రణాళిక రూపొందించాలని, ఈ మూడు నెలలు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. జనసేన వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఊసా రాజేష్, జిల్లా మైనింగ్ అధికారి రాజేష్‌కుమార్, తహసీల్దార్ ఐ.మునిలక్ష్మి, ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు, వేమూరు సీఐ పి.రామకృష్ణ, సర్వేయర్ బొర్రా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: సీజనల్ వ్యాధులు తగ్గించేలా వైద్య సిబ్బంది పనిచేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్స్, ల్యాబ్ టెక్నీషియన్‌ల నెలవారీ సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యాధులు సోకకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. వ్యాధుల నియంత్రణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పంచాయతీ, మున్సిపాలిటీల అధికారులతో సమన్వయంగా ఉండి, పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. వర్షం నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు నివారించుకోవాలని, ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలన్నారు. ఓపీకి వచ్చిన రోగుల్లో కనీసం 15 శాతం మందికి రక్త పరీక్షలు చేయాలన్నారు. లేబొరేటరీలో వైద్య పరీక్షలు చేసేందుకు కావాల్సిన రసాయనాలన్నింటిని అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ల్యాబ్ టెక్నీషియన్లు రిజిస్టర్లు, రిపోర్టులను అప్‌డేట్‌గా ఉంచుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు కీటక జనిత వ్యాధుల నివారణ చర్యలు చేపట్టి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, డెంగీ కేసులను గణనీయంగా తగ్గించాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్లు, రాజు నాయక్, ప్రభాకర్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్లు దస్తగిరి, ఘంటసాల శ్రీనివాసరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీ ప్రతినిధులు



మొక్కలు నాటుతున్న ప్రతినిధులు

తాడేపల్లి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి 2024-25 నూతన కార్యవర్గం శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఘాట్ రోడ్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెట్టి రామకోటిరెడ్డి విచ్చేసి శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట ఘాట్ రోడ్‌మార్గం డివైడర్లలో పెద్ద కదంబం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ ఏడు ప్రధానాంశాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణ కోసం శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి ఘాట్ రోడ్‌లో మొక్కలు నాటామని, పర్యావరణ ఆవశ్యకతను యువత గుర్తించాలన్నారు. అనంతరం రోటరీ ఇంటర్నేషనల్ 3150 రోటరీ డిస్ట్రిక్ట్ పీడీజీ అన్నెరత్న ప్రభాకర్ జన్మదిన వేడుకలను లిటిల్ విలేజ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, క్లబ్ ట్రైనర్ అనిల్ చక్రవర్తి, కార్యదర్శి అందె మురళీమోహన్, కోశాధికారి వల్లమూడి శ్రీనివాసరావు, సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య, పాస్ట్ క్లబ్ అధ్యక్షులు అందె రేవంత్ కుమార్, చనుమోలు గోపాలరావు, కేవీఎస్ ప్రకాశరావు, అవ్వారు ఫణికుమార్, కొతరపు వేణుగోపాల్, ఉడతా శ్రీనివాసరావు, తాడేపల్లి, చిలకలూరిపేట, పండరీపురం, తెనాలి, పెదనందిపాడు రోటరీ క్లబ్ ప్రతినిధులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామారావు

తెనాలి: రాష్ట్రంలోని కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజానాట్య మండలి కళాకారుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ జానపద, పౌరాణిక, సాంఘిక, ఔత్సాహిక కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలను చైతన్య పరిచేందుకు కళారూపాల అవసరం ఎంతగానో ఉందన్నారు. గ్రామ గ్రామాన ప్రదర్శనలిచ్చి ప్రజల్లో మార్పు తీసుకురావాలని అందుకు ప్రభుత్వం పూనుకుని కళా సంస్థలు, కళాకారులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కళా ప్రదర్శనలకు వెళ్లే కళాకారులకు బస్సు, రైలులో రాయితీలు కల్పించాలని సూచించారు. గతంలో నాటక ప్రదర్శనలకు వెళ్లే కళా సంస్థలకు రాయితీలు ఇచ్చేవారని, తర్వాతి కాలంలో ఆ సౌకర్యాన్ని తొలగించారని రామారావు గుర్తుచేశారు. వెంటనే రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. ఈ నెల 7న ఉదయం 10 గంటలకు గుంటూరు కార్యాలయంలో జరిగే సభకు అధిక సంఖ్యలో కళాకారులు తరలిరావాలని కోరారు. ప్రజానాట్య మండలి జిల్లా సమితి సభ్యులు దేవరపల్లి నీలాంబ్రం, ముక్కాల మాణిక్యారావు, విజయ దుర్గ, విజయలక్ష్మి, వీణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బస్సు అందజేత

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పుల్లడిగుంట వాసి ప్రవాసాంధ్రుడు ఉప్పుటూరి రామచౌదరి రూ.8 లక్షల విలువచేసే బస్సును అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ విద్యార్థులు ప్రయాణానికి అవసరమైన వాహనాన్ని అందజేయటం జరిగిందని, తన తల్లి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం వాహనాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూకుంట శ్రీనివాసరావుకు అందించానన్నారు. పాఠశాల వాహనం నిర్వహణకు అయ్యే ఖర్చులు స్థానికంగా ఏర్పాటు చేసిన రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు చూస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ ప్రెసిడెంట్ మన్నవ పూర్ణచంద్రరావు, ప్రముఖ వ్యాపారవేత్త నేరెళ్ల తిరుపతిరావులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

నేటి విద్యాసంస్థల బంద్ విజయవంతానికి పిలుపు

రేపల్లె రూరల్: విద్యా రంగంలో సమస్యల పరిష్కారానికై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)ఆధ్వర్యంలో ఈ నెల 4న తలపెట్టిన బంద్‌లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు పాల్గొనాలని ఆ శాఖ డివిజన్ ఉపాధ్యక్షుడు వై.నవీన్ కోరారు. రేపల్లె పట్టణ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బంద్ నోటీసులు బుధవారం అందజేసి అనంతరం మాట్లాడారు. దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీతో వైద్య విద్యార్థులు నష్టపోయారన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ విద్యా సంస్థల్లో సుమారు 61 వేల పాఠశాలలను మూసివేశారని ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యారంగం విచ్చలవిడిగా పెరిగి ప్రభుత్వ విద్యా వ్యవస్థ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ యూనివర్సిటీల్లో ప్రశ్నిస్తున్న విద్యార్థులపై పెడుతున్న అక్రమ కేసులను ఎత్తివేయాలని, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో విద్యా రంగంలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారం కోరుతూ 4వ తేదీన నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రేపల్లె పట్టణ కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్, ప్రవీణ్, నాగార్జున, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



నిజాంపట్నం: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డాక్టర్ నాగార్జున, డాక్టర్ ప్రణవి తెలిపారు. నిజాంపట్నం మండలంలోని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవటం వల్ల డెంగీ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సూచించారు. దోమలను నిర్మూలించడం వల్ల డెంగీ వ్యాధి సోకే అవకాశం ఉండదని చెప్పారు. అనంతరం ప్రధాన రహదారి వెంబడి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణవి, హెల్త్ సూపర్‌వైజర్ మురళి, విజయ సుశీల, మాధవి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాభారత సభాపర్వం ప్రవచనాలు

నగరంపాలెం: వేదవ్యాస మహర్షి రచించిన మహాభారతం పంచమవేదమని శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై మహా భారతంలోని సభాపర్వం జూదఘట్టంపై ప్రారంభమైన ప్రవచన కార్యక్రమాలు బుధవారం జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కౌరవ- పాండవ దౌత్య విశేషాలు, ద్రౌపది పరాభావం, ధృతరాష్ట్రులు ద్రౌపదికి వరప్రదానాలు, కౌరవుల పిలుపు, 12 ఏళ్ల వనవాసం తదితర అంశాలను భక్తులకు శ్రీకూర్మనాథస్వామి తెలియజేశారు.

సఫాయి కర్మచారి కమిషన్ మెంబర్‌తో నగర కమిషనర్ భేటీ



నెహ్రూనగర్: గుంటూరు విచ్చేసిన జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ మెంబర్ డాక్టర్ పీపీ వావాను నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువారం నిర్వహించనున్న సమావేశానికి హాజరయ్యేందుకు వావా ఇక్కడకు వచ్చారు. సఫాయి కార్మికుల సంక్షేమ కోసం సఫాయి కార్మికులతో, నాయకులతో, అధికారులతో ప్రత్యేక సమావేశం కానున్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత

నగరంపాలెం: గుంటూరు నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో బుధవారం పోలీస్ కుటుంబాలకు సుమారు రూ.4.50 లక్షల విలువచేసే చెక్కులను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అందించారు. గత నెలలో తుళ్లూరు ట్రాఫిక్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ షేక్ ఖాజాసాహెబ్ అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన భార్య జానీబేగంకు ఫ్లాగ్, వీడో ఫండ్‌ల కింద రూ.1,75,000, గుంటూరు ట్రాఫిక్ పీఎస్ కానిస్టేబుల్ పి.సునీల్‌బాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా, ఆయన భార్య నాగహన్నకు రూ.1,75,000, ఏఆర్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసరావు ఈ ఏడాది ఫిబ్రవరిలో మృతిచెందగా, ఆయన భార్య బాలనాగమ్మకు అదనపు కార్పస్ ఫండ్ లక్ష రూపాయల చెక్కలను జిల్లా ఎస్పీ అందించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు సబ్ డివిజన్ ఏఎస్పీ నిచికేట్ షేల్కి, డీపీఓ ఏఓ వేంకటేశ్వరరావు, మినిస్టీరియల్ సిబ్బంది రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా నక్షత్ర శాంతి మహాయజ్ఞం

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠం ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ నవగ్రహ సహిత శ్రీ నక్షత్ర శాంతి మహాయజ్ఞాన్ని 21వ రోజైన బుధవారం ఘనంగా నిర్వహించారు. రోహిణి నక్షత్రం వారితో గణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర శాంతి హోమం, మృత్యుంజయ హోమాన్ని యల్లాప్రగడ పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు జరిపించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కావూరు సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరరావు, విజయలక్ష్మి మాతృమండలి సభ్యులు గోపు ప్రభారాణి, గుర్రం పద్మ, పెనుగొండ ప్రమీల, కనికచర్ల జానకి, వసంత, గౌరి పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

బాబాల మూఢత్వ ప్రచారాన్ని ఆపాలి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ వ్యాప్తంగా అనేక మంది బాబాలు ప్రజల్లో మూఢత్వాన్ని, అశాస్త్రీయ ధోరణులను ప్రచారం చేస్తున్నారని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాబాలు చేస్తున్న అశాస్త్రీయ ధోరణులతో అమాయక ప్రజలు అనేక రకాలుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో భోలేబాబా పాతధూళి కోసం జరిగిన తొక్కిసలాటలో 116 మంది మరణించడం, వందలాది మంది గాయపడటం బాధాకరమన్నారు. దీనికి కారకులైన బాబాలపై చర్యలు తీసుకోవడంతో పాటు మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని తేవాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 (హెచ్) ప్రకారం ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పాఠ్యాంశాల్లో వీటిని పొందుపరచాలని కోరారు.

వ్యక్తిపై ఇరువురు దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై ఇరువురు దాడిచేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే జయరామ్‌పై పాతకక్షల నేపథ్యంలో చిట్టాల ఆంజనేయులు, నరసింహారావు బుధవారం దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూపీలో తొక్కిసలాట ప్రభుత్వ వైఫల్యమే

పొన్నూరు: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో 'భోలే బాబా సత్సంగ్'లో జరిగిన తొక్కిసలాటలో వందలాది మంది చనిపోవటం బాధాకరమని పొన్నూరు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జక్కా రవీంద్రనాథ్ అన్నారు. భక్తులు బాబా పాదధూళి కోసం ఒక్కసారిగా రావడంతో జరిగిన తొక్కిసలాట దృశ్యాలు కలచివేశాయని అన్నారు. ఈ ఘటనకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. హిందువైనందుకు గర్వపడుతున్నామంటూ చెప్పుకుంటున్న మోదీ - యోగీలు ప్రభుత్వాలను నడిపి, ప్రజలను పాలించమంటే ఎక్కడలేని అసమర్థత ప్రదర్శిస్తుంటారని విమర్శించారు. ఇంత పెద్ద మృత్యుహేళ జరిగినప్పటికీ ఇద్దరిలో చలనం లేకపోవటం ఈ దేశ ప్రజలు చేసుకున్న దురదృష్టం అని అన్నారు. హిందూ అనే పేరుతో రాజకీయాలు చేసే బీజేపీకి ప్రజల ప్రాణాలతో పని లేదని, ఈ ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పోస్టల్ స్టాంపుల సేకరణపై పోటీలు



తెనాలి: పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ నికేతన్ విద్యా సంస్థల్లోని 8, 9,10 తరగతుల విద్యా సంస్థల విద్యార్థులకు స్టాంపుల సేకరణపై పోటీలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకరబాబు అందజేశారు. పోస్టల్ స్టాంపుల సేకరణ అనేది హాబీల్లో గొప్పదని, పోస్టల్ స్టాంపులు కావాలనుకుంటే దగ్గర్లోని పోస్టాఫీసును సంప్రదించాలని కోరారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను, ప్రోత్సహించిన యాజమాన్యాన్ని, ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు.

కౌలు రైతులకు నేరుగా సీసీఆర్ కార్డులు అందివ్వాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామాల్లో సంతకాల సేకరణ



భట్టిప్రోలు: కౌలు రైతులకు భూ యజమాని సంతకం లేకుండా సీసీఆర్ కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ సీసీఆర్ కార్డులో భూ యజమాని సంతకం నిబంధన తొలగించి, గ్రామ సభల ద్వారా కార్డులు ఇవ్వాలని కోరారు. కార్డులు వచ్చిన ప్రతి ఒక్కరికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంక్‌లలో రుణాలు ఇవ్వాలని సీసీఆర్సీ చట్టాన్ని రద్దు చేసి 2011లో ప్రవేశపెట్టిన ఎల్ఈసీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంతకాల సేకరణ చేసి సీఎం చంద్రబాబు నాయుడుకు పంపనున్నట్లు తెలిపారు. మండలంలోని ఓలేరు, గొరిగపూడి, దాసరిపాలెం, పెదపులివర్రు, భట్టిప్రోలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి. కృష్ణమోహన్, పి. మనోజ్ కుమార్, ఎం.సత్యన్నారాయణ, కె.రమేష్, బి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు న్యాయం చేయాలి



చినపులివర్రులో కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

కొల్లూరు : కౌలు రైతులకు ప్రభుత్వం మంజూరు చేసే కౌలురైతు గుర్తింపు కార్డులు భూ యజమాని సంతకంతో పని లేకుండా మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చినపులివర్రు, తాడిగిరిపాడు, రావికంపాడు గ్రామాలలో కౌలురైతు గుర్తింపు కార్డుల మంజూరులో భూ యజమాని సంతకం నిబంధనను తొలగించాలని కోరుతూ వినతిని ప్రభుత్వానికి అందజేసేందుకు కౌలు రైతుల సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కౌలురైతుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో వారికి ప్రభుత్వం అండగా నిలవాలంటే భూ యజమాని, కౌలు రైతు గుర్తింపు కార్డుల ప్రక్రియలో చట్టాలను సవరించాలని అన్నారు. ప్రతి కౌలు రైతుకు కార్డులు మంజూరు చేయడంతో పాటు, బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.మణిలాల్, నాయకులు ఎం.మనోజ్‌కుమార్, ఎం. సత్యనారాయణ, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిస్టర్ విమల మేరీ, అమల జోస్ఫిన్, యలమంద తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రిటీషు వారిని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలని సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ విమల మేరీ పేర్కొన్నారు. బుధవారం అమరావతి రోడ్డులోని సెయింట్ ఆన్స్ కళాశాలలో అల్లూరి జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ అమల జోస్ఫిన్ మాట్లాడుతూ తెలుగుతల్లి ముద్దుబిడ్డ, మన్యం దొర అల్లూరి వీరోచిత పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులతో అల్లూరి జీవితగాథపై ఉపన్యాసాలు, పాటలు, క్విజ్ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యలమంద పాల్గొన్నారు.

పోషకాహార లోపంతో ఐక్యూ ప్రభావితం



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ యుగంధర్ కుమార్

లాం(తాడికొండ): చిన్నారుల్లో పోషకాహారం లోపించడం వల్ల వారి ఐక్యూ లెవల్స్ ఆశించిన స్థాయిలో పెరగకుండా తీవ్ర ప్రభావం పడుతుందని లాంలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ యుగంధర్ కుమార్ అన్నారు. తాడికొండ మండలం లాం అంగన్‌వాడీ సెక్టార్‌లోని కేంద్రంలో నిర్వహించిన అవగాహనా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 సంవత్సరాల లోపు చిన్నారులకు సమీకృత పౌష్టికాహారం అందించడం ద్వారా వారిలో సామర్థ్యం పెంచవచ్చన్నారు. పోషకాహార లోపం వల్ల చిన్నారులు అన్ని రంగాలలో వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు రాగి, కొర్రల మిశ్రమంలో బెల్లం కలిపిన పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త దీపా, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ కళావతి, ఎంఎస్‌కే సునీత, కార్యకర్తలు చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రాఘవరావు

తెనాలి: ప్రపంచ టూ వీలర్స్ మెకానిక్స్ డే సందర్భంగా ఆంధ్రాప్యారిస్ మోటార్ సైకిల్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక అయితానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కల్యాణ మండపంలో ఏర్పాటైన సభకు అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా అధ్యక్షత వహించారు. తెనాలి మోటారు వాహనాల తనిఖీ అధికారి తోట రాఘవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోటారు సైకిల్ వాహన చట్టం గురించి వివరించారు. చట్టం నిబంధనలకు లోబడి అందరూ నడుచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అంతా సహకరించాలని కోరారు. సహాయ మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎన్‌బీ మధుసూదనరావు రోడ్డు భద్రతా నియమాలను వెల్లడించారు. తొలుత కేక్ కటింగ్ చేశారు. మెకానిక్‌లు తమ గురువులకు సత్కారం చేశారు. సంఘ మాజీ అధ్యక్షుడు అడపా వెంకట లక్ష్మీసంపత్‌రాయుడు ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన ఎస్కే మస్తాన్ మేస్త్రి కుమార్తె ఎస్కే ఆఫీపా తొయ్యిబ, ఎం.మహేష్ మేస్త్రి కుమారుడు ఈశ్వర వెంకట నాగకైలాష్‌కు ముఖ్య అతిథుల చేతుల మీదుగా రూ.10 వేల నగదు బహుమతులను అందజేశారు. అడపా నారాయణ రావు-రంగనాయకమ్మ జ్ఞాపకార్థం వీటిని బహూకరించినట్టు తెలిపారు. ప్రధాన కార్యదర్శి షేక్ ఖాశిం, అశోక్, ఆంజనేయులు, గోపి, జాని, బాష, మాధవరావు, కరిముల్లా, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలి

తెనాలిరూరల్: ఖరీఫ్ సీజను ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని వీఆర్‌వోలు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌వోలు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. కౌలు రైతు గుర్తింపు కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను అటు కౌలు రైతులతో పాటు, భూమి యజమానులకు వివరించాలని సూచించారు. సాగుదారులందరినీ గుర్తించి కార్డులు అందేలా చూడాలన్నారు. సాగుకు సమాయత్తమవుతున్న రైతులకు వీటి గురించి అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.